సాక్షి నిర్మల్

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో అంతర్రాష్ట్ర రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ సోయం బాపూరావు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. 8లో▸



చిన్నారుల్లో చిరునవ్వు

బాల కార్మికుల విముక్తి కోసం ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ సత్ఫలితాలి స్తోంది. చిన్నారుల మోములో చిరునవ్వులు పూస్తున్నాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.3 /24.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోత గా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యేలు

నిర్మల్‌టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు గురువారం అసెంబ్లీలో కలిశారు. అసెంబ్లీ వాయిదా అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, దివాకర్‌రావు, ఆత్రం సక్కు, దుర్గం చిన్నయ్య, బాపూరావు సీఎం కార్యాలయానికి వెళ్లారు. పంట రుణాలు మాఫీ చేసినందుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులను ఆదుకోండి

భైంసాటౌన్: ఇటీవలి వర్షాలకు ముధోల్ నియోజకవర్గంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. ముధోల్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా నష్టం వాటిల్లిందని తెలిపారు. రోడ్లు దెబ్బతిన్నాయని, విద్యుత్ స్తంభాలు విరిగాయని, ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయని, ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారని వివరించారు. పశువులు మృత్యువాత పడ్డాయని పేర్కొన్నారు. బాధితులను ఆదుకోవాలని కోరారు.

'మన ఊరు - మనబడి' గడువులోపు పూర్తి చేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి చేపట్టిన మన ఊరు – మనబడి పనులు గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మన ఊరు – మనబడి, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్యామేజ్ అయిన రోడ్లపై ట్రాఫిక్ జామ్, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అర్లి వంతెన నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయడం జరుగుతుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విరిగిన విద్యుత్ స్తంభాలను త్వరగా పునరుద్ధరించాలన్నారు. రైతులకు రైతుబీమాపై అవగాహన కల్పించి బీమా చేయించాలని, దానిని ఏటా రెన్యూవల్ చేసుకునేలా చూడాలన్నారు.

ముగిసిన శాలసిద్ధి, తొలిమెట్టు శిక్షణ

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా ఉపాధ్యాయులకు నిర్వహించిన శాలసిద్ధి, తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాలు గురువారం ముగిశాయి. వశిష్ట డిగ్రీ కళాశాలలో జరిగిన శిక్షణ శిబిరంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమం విద్యార్థుల అభ్యాసానికి, వి షయ పరిజ్ఞానానికి, పాఠశాలల అభివృద్ధికి దో హద పడాలన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ఉ పాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను ఆయా పాఠశాలల్లో తప్పకుండా అమలు చేయాలన్నారు. ఇలాంటి శిక్షణలతో ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలు మెరుగవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు ప్రవీణ్‌కుమార్, లింబాద్రి, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, రిసోర్స్ పర్సన్స్ తోడిశెట్టి పరమేశ్వర్, గంగన్న, సాజిద్, ముబీన్, జావిద్ హిలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారి నృత్యం



మెమొంటోతో చిన్నారి శాన్విక

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన సోని–శివరామకృష్ణ దంపతుల కూతురు శాన్విక నృత్య ప్రదర్శనలో రాణిస్తోంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శ్రీకృష్ణసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచింది. దీంతో స్వర్ణ నంది పురస్కారం అందుకుంది. చిన్నారిని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నృత్యశిక్షకురాలు నవ్య అభినందించారు.

మెడికల్ అడ్మిషన్



తొలి వైద్యవిద్యార్థికి అడ్మిషన్ లెటర్ అందిస్తున్న కలెక్టర్

వైద్యకళాశాల వివరాలు..

మొత్తం సీట్లు	100
ఆలిండియా కోటా	15
రాష్ట్ర కోటా	85
ప్రస్తుతం ప్రొఫెసర్లు	02
అసోసియేట్ ప్రొఫెసర్లు	03
అసిస్టెంట్ ప్రొఫెసర్లు	18

- జిల్లా వైద్య కళాశాలలో ఈ ఏడాది నుంచే తరగతులు
- ప్రవేశాలు ప్రారంభించిన వైద్య విద్యాశాఖ
- ఆలిండియా కోటాలో రాజస్థాన్ విద్యార్థికి సీటు..
- అడ్మిషన్ లెటర్ అందించిన కలెక్టర్

నిర్మల్: జిల్లాలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ మరో అడుగు ముందుకేసింది. నిర్మల్ వైద్య కళాశాలలో తొలి విద్యార్థి అడుగుపెట్టాడు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆలిండియా కోటా మెడికల్ కౌన్సెలింగ్‌లో భాగంగా రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మృదుల్ గోయల్ నిర్మల్‌లో మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందాడు. ఈమేరకు స్థానిక భీమన్నగుట్ట సమీపంలోని మెడికల్ కాలేజీలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి తొలి విద్యార్థికి అడ్మిషన్ లెటర్‌ను గురువారం అందించారు.

ఈ ఏడాది నుంచే తరగతులు..

జిల్లాకు మెడికల్ కాలేజీ వచ్చింది కానీ.. తరగతులు ప్రారంభమయ్యేదెప్పుడూ..! అన్న సందేహాలు నిన్నమొన్నటి వరకూ వ్యక్తమయ్యాయి. తాజాగా విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఈ ఏడాది నుంచే తరగతులు ఆరంభిస్తారన్న విషయం స్పష్టమైంది. ఇదే విషయాన్ని ప్రిన్సిపాల్ కూడా ధ్రువీకరించారు. మొత్తం కళాశాలలో వంద సీట్లు ఉండగా, ఆలిండియా కోటాలో 15, రాష్ట్రానికి సంబంధించి మిగిలిన 85 సీట్లను భర్తీ చేయనున్నారు. ఆలిండియా కోటాకు సంబంధించి శుక్రవారంతోనే గడువు ముగుస్తుందని పేర్కొన్నారు.

వేగంగా కాలేజీ పనులు..

ఎన్నికల వాతావరణం రాకముందే జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ప్రారంభం కావాలన్న ప్రభుత్వ ఉద్దేశానికి తగ్గట్లు జిల్లాకేంద్రంలోనూ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే తరగతుల నిర్వహణకు కావాల్సిన నిర్మాణ పనులను పూర్తిచేశారు. మిగిలిన పనులనూ త్వరితగతిన పూర్తిచేయనున్నట్లు కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. స్థానిక మల్లన్నగుట్ట అయ్యప్ప మందిరం ఎదుట, భీమన్నగుట్ట పక్కన మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తిచేస్తున్నారు. ప్రస్తుత జిల్లా ఆస్పత్రినే బోధనాస్పత్రిగా ప్రకటించి, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశారు.

సిబ్బంది నియామకాలు..

మెడికల్ కాలేజీకి కావాల్సిన ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర స్టాఫ్ నియామకాల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం ఈ ఏడాది ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నారు. ఫస్టియర్‌లో అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ సబ్జెక్టులు ఉండగా, వీటికి సంబంధించి ప్రస్తుతం ఒక ప్రొఫెసర్ ఉన్నారు. మిగతా వారినీ త్వరలోనే ప్రభుత్వం నియమించనున్నట్లు కాలేజీవర్గాలు తెలిపాయి.

తరగతులు ప్రారంభిస్తాం..

ప్రస్తుతం విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. ఆలిండియా కోటాలో ఒకరు అడ్మిషన్ తీసుకున్నారు. వైద్య కళాశాలకు సంబంధించిన పనులూ పూర్తవుతున్నాయి. ఈ ఏడాది నుంచే తరగతులను ప్రారంభిస్తాం.
– జేవీడీఎస్.ప్రసాద్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్

కంటి 'కలక'లం..!

- భైంసా పట్టణంలోని ఓ మదర్సాలో దాదాపు 30 మంది వరకు కళ్ల కలక వ్యాధి బారిన పడ్డారు. దీంతో ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ్ బాలస్వాస్థ్య కార్యక్రమం) ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి, మందులు అందించారు. అలాగే వారంరోజులపాటు ఐసోలేషన్‌లో ఉండాలని సూచించారు.
- బాసర ఆర్జీయూకేటీలో 98 మందికి కళ్ల కలక సోకడంతో కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో వర్సిటీ క్యాంపస్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధిసోకిన విద్యార్థులను ఐసోలేషన్‌లో ఉండేలా ఏర్పాట్లు చేశారు.
- కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ బాలికల గురుకుల పాఠశాలలో 402 మంది విద్యార్థినులు కళ్ల కలక బారిన పడి ఇబ్బంది ప డుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆందోళన అవసరం లేదని, అవసరమైన చర్యలు తీ సుకుంటున్నామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



నచ్చన్‌ఎల్లాపూర్ పాఠశాలలో కంటి కలకతో బాధపడుతున్న విద్యార్థినులు

- విద్యాసంస్థలు, వసతిగృహాల్లో వేగంగా వ్యాప్తి
- ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులు
- ఆందోళన వద్దంటున్న వైద్యులు

భైంసాటౌన్/నిర్మల్ చైన్‌గేట్: జిల్లాలో కళ్ల కలక వ్యాధి కలవరపెడుతోంది. వారం, పదిరోజులుగా వేగంగా వ్యాప్తి చెందుతోంది. చిన్న పిల్లలు మొదలు పెద్దల వరకు వ్యాధి బారిన పడుతున్నారు. ఒకరి నుంచి మరొకరికి సోకే లక్షణం ఉండడంతో ముఖ్యంగా పాఠశాలలు, గురుకులాలు, వసతిగృహాల్లో విద్యార్థులు కళ్ల కలక బారిన పడుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మంది వ్యాధి బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. కళ్లు ఎర్రగా మారడం, కంటి నుంచి నీరు కారడం, దురద, కంటి నొప్పి, కంటి రెప్పలు అతుక్కుపోవడం, వాపు వంటి లక్షణాలతో ఇబ్బందులు పడుతున్నారు. బ్యాక్టీరియా ద్వారా వ్యాధి సోకిన వారికి ఐదురోజుల్లో నయమవుతుందని, వైరస్ కారణంగా వస్తే ఒకటి లేదా రెండు వారాల వరకు ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆస్పత్రులకు క్యూ...

కళ్ల కలక వ్యాధి బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో ఆస్పత్రుల్లో ఓపీ పెరుగుతోంది. భైంసా ఏరియా స్పత్రిలో రోజుకు 200 నుంచి 250 మంది కళ్ల కలక వ్యాధి బాధితులు వస్తున్నట్లు ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి సైతం రోజుకు వంద మంది కళ్ల కలక బాధితులు వస్తున్నారు. అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ అధికారులు అవసరమైన మందులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంటున్నారు.

ఆందోళన వద్దు...



కంటి కలక సాధారణ వ్యాధి. సోకినవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వైద్యుల సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. వారం దాటినా తగ్గని పక్షంలో వైద్యులను సంప్రదించాలి. ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో యాంటిబయాటిక్ ఐ డ్రాప్స్, లుబ్రికేటింగ్ ఐడ్రాప్స్ అందుబాటులో ఉన్నాయి. – డాక్టర్ ధన్‌రాజ్, డీఎంహెచ్‌వో

జాగ్రత్తలు తీసుకుంటున్నాం...



పాఠశాలల్లో విద్యార్థులు కళ్లకలక బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇదివరకే సోకిన విద్యార్థులను గుర్తించి ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. కేజీబీవీల్లో ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందకుండా ఐసోలేషన్ ఏర్పాట్లు చేస్తున్నాం.
– రవీందర్‌రెడ్డి, డీఈవో

వసతి గృహంలో 200 మందికి కళ్ల కలక

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో మొత్తం 626 మంది విద్యార్థులు ఉండగా, ఇందులో 200 మందికిపైగా కళ్ల కలకతో బాధపడుతున్నారు. రోజురోజుకూ బాధితులు పెరుగుతున్నారు. దీంతో తల్లిదండ్రులు వసతి గృహానికి వచ్చిన తమ పిల్లలను ఇంటికి పంపించాలని కోరుతున్నారు. అయితే వైస్ ప్రిన్సిపాల్ రాధిక పిల్లలను పంపించేందుకు అనుమతి ఇవ్వడం లేదు. పిల్లలకు ప్రత్యేక గదుల్లో చికిత్స అందిస్తున్నామని, ఎవరూ ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో ఐదుగురు, ఎస్టీ హాస్టల్‌లో పది మంది విద్యార్థులకు కూడా కళ్ల కలక సోకినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కడెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులను పర్యవేక్షిస్తున్నారు.

ఎన్నికల భయంతోనే రుణమాఫీ

- ఆస్తులు కాజేసేందుకు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం
- బీజేపీ పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం కేసీఆర్ ఎన్నికల భయంతోనే తొమ్మిదేళ్లుగా నెరవేర్చని హామీలు ఇప్పుడు హడావుడిగా నెరవేరుస్తామని ప్రకటనలు చేస్తున్నారని బీజేపీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల రాంనాథ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదని గుర్తించి ప్రజలకు ఇచ్చిన హామీలను మరోసారి గుర్తిస్తూ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గతంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయమని కార్మికులు సమ్మె చేసినా పట్టించుకోలేదన్నారు. 33 మంది కార్మికులను బలి తీసుకున్నారన్నారు. అనేక మందికి బలవంతంగా వీఆర్ఎస్ ఇప్పించి బయటకు పంపారని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రభుత్వంలో విలీనం చేస్తానని చెప్పి ఆర్టీసీ ఆస్తులు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తొమ్మిదేళ్లుగా పంట రుణాలు మాఫీ చేయని సీఎం ఇప్పుడు నెల రోజుల్లో రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటికే తీసుకున్న రుణాలకు రైతులు భారీగా వడ్డీలు కట్టారన్నారు. వడ్డీతో కలిపి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి 4000 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేస్తామని మోసం చేశారన్నారు. దళితబంధు పేరుతో దళితులను, బీసీబంధు పేరుతో బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దగా పడ్డ తెలంగాణలో ప్రజలు కేసీఆర్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు అయ్యన్నగారి రాజేందర్, తోట సత్యనారాయణ, రచ్చ మల్లేశ్, బాబా పాల్గొన్నారు.

కడెం ఆయకట్టుకు నీటి విడుదల



సాక్షిలో ప్రచురితమైన కథనం



ఎడమ కాలువకు నీటిని విడుదల చేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

కడెం: కడెం ప్రాజెక్టు ఆయకట్టుకు అధికారులు గురువారం నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులో నిండా నీరున్నా ఆయకట్టుకు నీటి విడుదలలో జాప్యం చేస్తున్న తీరుపై 'కండె నీటి విడుదలెప్పుడో' శీర్షికన ఈనెల 3న 'సాక్షి'లో కథనం ప్రచురించాం. దీనికి స్పందించిన నీటిపారుదల శాఖ అధకారులు గురువారం ఎడమ కాలువకు 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాలువకు పలు చోట్ల మరమ్మతులు పూర్తిచేసి వెయ్యి క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

నిలకడగా నీటిమట్టం

కడెం ప్రాజెక్టు నీటిమట్టం నిలకడగా ఉంది. పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 689.450(5.150టీఎంసీ)అడుగుల నీరు ఉంది. ప్రాజెక్టులోకి 1,348 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని అధికారులు తెలిపారు.

అల్బెండజోల్‌తో నులి పురుగుల నివారణ

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: అల్బెండజోల్ మాత్రలతో నులి పురుగుల నుంచి రక్షణ లభిస్తుందని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినం పురస్కరించుకుని డీఎంహెచ్‌వో ధనరాజ్, డీఈవో రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, సోఫీనగర్‌లోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగులతో పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గుతుందని, శారీరక, మానసిక సమస్యలు, ఎదుగుదల మీద ప్రభావం ఉంటుందని వివరించారు. ఆకలి లేకపోవడం, అలసట, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. పిల్లల్లో నులి పురుగుల నియంత్రణకు అల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నయనరెడ్డి, ఎన్సీడీ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ గంగశంకర్, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి రవీందర్, డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌వో గిరిబాబు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీ టీమ్స్

- ఎస్పీ ప్రవీణ్ కుమార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్ టౌన్: విద్యార్థినులు, యువతులు, మహిళల భద్రత కోసం షీటీమ్స్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో షీటీమ్స్, మానవ అక్రమ రవాణాకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురిచేసినా, మానసికంగా, శారీరకంగా హింసించినా, సోషల్ మీడియాలో ఫొటోలు మార్చి వేధించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. షీటీమ్స్ ఆకతాయిలను పట్టుకుని మైనర్లు అయితే కౌన్సెలింగ్ ఇవ్వడం, మేజర్లు అయితే కేసు నమోదు చేస్తారని తెలిపారు. ఉమెన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ, సైబర్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటికి దృష్టికి వస్తే షిటీమ్ పోలీసులకు లేదా, 100, 1,098, 1,930 నంబర్లకు లేదా వాట్సప్ నంబర్ 8712659550 కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, షీటీమ్ ఎస్సై సుమాంజలి, హెడ్ కానిస్టేబుల్ లింగయ్య, కానిస్టేబుళ్లు రమాదేవి, రాధిక, హోంగార్డు రమాదేవి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి అవగాహన

జిల్లా కేంద్రంలోని సాయుధ దళ కార్యాలయంలో వేతనాల అకౌంటు, ఇతర ప్రయోజనాలపై భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ పోలీస్ అధికారులు, సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ, బీవోబీ బ్యాంకుల్లో శాలరీ అకౌంట్ ఉంటే అనుకోకుండా ఆక్సిడెంట్, అంగవైకల్యం కలిగితే వచ్చే ప్రయోజనాలు వివరించారు. కార్యాలయం ఆవరణంలో ఆయా బ్యాంకుల వారు క్యాంపులు నిర్వహిస్తారని అకౌంట్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్లు ప్రవీణ్, సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి కేసీఆర్



పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్‌టౌన్: రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్ అని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ పంట రుణాలు మాఫీ చేస్తూ ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం సంబురాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ విప్ నేరెళ్ల వేణు, జిల్లా తెలంగాణ జాగృతి అధ్యక్షుడు లక్ష్మణ చారి, కౌన్సిలర్లు ఎస్పీ రాజు, తులసి, బీఆర్ఎస్ నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాలం శ్రీనివాస్, ఆకోజి కిషన్, పూదరి సాయికృష్ణ, జగడం రాజు, హరీశ్, అనిల్, తోట సురేందర్, గోపు గోపి, నవీన్, గంధం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకుర్ తిరుపతి అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కార్మిక శాఖ అధికారి సాయిబాబాకి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల వేతనాలు సవరించడం లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలను చెల్లించాలని కోరారు. పెరుగుతున్న ధరల కు అనుగుణంగా రోజుకు రూ.600 కూలి చెల్లించాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొప్పని పద్మ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి బి.సత్యనారాయణ, ముత్తన్న, జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, జిల్లా కమిటీ సభ్యుడు నారాయణ, డివిజన్ నాయకులు బరికుంట గంగారం, నాయకులు పోతన్న, నిమ్మ రాజన్న, అశోక్ పాల్గొన్నారు.

'ఆయిల్‌పాం'కు ప్రోత్సాహం

కడెం: ఆయిల్‌పాం సాగుకు రాయితీలు, సబ్సిడీలతో ప్రభుత్వ ప్రోత్సాహం ఇస్తుందని హార్టికల్చర్ రిటైర్డ్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని లింగాపూర్ పంచాయతీ కార్యాలయంలో ఆయిల్ పాం సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. మొక్కలకు సబ్సిడీతోపాటుగా, పంట ఖర్చులకు ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లు అందిస్తుందని తెలిపారు. డ్రిప్‌పై ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీ, ఓసీ రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు ప్రీయూనిక్ కంపెనీ డీజీఎం రామ్మోహన్‌రావు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు క్లస్టర్ అధికారి శేషేందర్ 9154989052ను నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన పీవో



భోజనాన్ని పరిశీలిస్తున్న పీవో

తాంసి: మండల కేంద్రంలోని ఐటీడీఏ ఆశ్రమోన్నత పాఠశాలను ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, తరగతుల నిర్వహణ, బోధన తీరును హెచ్‌ఎం ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతగా లేకపోవడంతో పాటు సాంబార్ రుచి లేకుండా నీళ్లలా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే భోజన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భీంపూర్ మండలంలోని నిపాని పాఠశాలలోని పోలింగ్ సెంటర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి మార్చడంతో పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ విష్ణు, ఆర్ఐ అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు దేవన్న, హర్షవర్ధన్ ఉన్నారు.

సహాయం అందిస్తున్న మానవతావాదులు



సాయం అందిస్తున్న సభ్యులు

సాక్షి స్పందన

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామం వద్ద రెండు ఆటోలు ఢీకొట్టిన సంఘటనలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న తొర్తి సాగర, కూతురు సోనిల ఆపరేషన్‌కు ఆదుకోవాలని 'నిమ్స్‌లో తల్లీ కూతుళ్లు' శీర్షికన ఈ నెల 2న సాక్షి కథనం ప్రచురితమైంది. దీంతో మానవతావాదులు స్పందిస్తున్నారు. జాతి రత్నాలు టీం సభ్యులు గురువారం రూ.8వేలు అందించారు. ఇప్పటివరకు రూ.1,22,753 సహాయంగా అందించారు. వైద్యులు నవీన్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, విశ్వనాథ్, ఖాలీద్, అల్లకొండ పోతన్న, రమాకాంత్, రామకృష్ణ, శివ, మనోహర్ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఖానాపూర్: పట్టణంలోని ఖానాపూర్ శివారు ప్రాంతంలోని పేకాటాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశామని ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారి వద్ద రూ.10500 నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా పేకాట ఆడితే ప్రజలకు తమకు సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

వాగులో పడిన బొలెరో వాహనం

భైంసారూరల్: భైంసా – నిర్మల్ జాతీయ రహదారిపై కూరగాయల లోడ్‌తో పుణే నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. అయితే ఇటీవల భారీ వర్షాలతో జాతీయ రహదారి పూర్తిగా దెబ్బతింది. మాటేగాం వద్ద ఒకవైపు రోడ్డు కోతకుగురైంది. ఎప్పటిలాగే గురువారం వేకువజామునే కూరగాయల లోడ్‌తో వస్తున్న బులెరో వాహనం అదుపు తప్పి వంతెనపై నుంచి మాటేగాం వాగులో పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఉన్న స్థానికులు పచ్చిమిరప, చిక్కుడుతోపాటు ఇతర కూరగాయలను తీసుకుని వెళ్లిపోయారు. డ్రైవర్ అనిల్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి క్రేన్ సాయంతో బొలెరో వాహనాన్ని బయటకుతీశారు.

చిన్నారుల్లో చిరునవ్వు

- వెట్టిచాకిరీ వదిలి చదువులమ్మ ఒడికి
- ఆపరేషన్ ముస్కాన్‌లో ఉమ్మడి జిల్లాలో వేల మందికి విముక్తి
- జూలై 31న పూర్తయిన 9వ విడత కార్యక్రమం



బాల కార్మికులతో అధికారులు

నిర్మల్ ఖిల్లా: పెన్ను పుస్తకాలు పట్టాల్సిన చిన్నారుల చేతులు తట్ట పారాలను పడుతున్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాల నుంచి వచ్చిన బాలలు కూలీలుగా మారుతున్నారు. బట్టల షాపులు, కిరాణాషాపులు, బేకరీలు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లల్లో పనిచేస్తూ వారి జీవితాన్ని కుటుంబం కోసం ధారపోస్తున్నారు. మనసులో చదువుకోవాలనే కోరికున్నా కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో పొట్టకూటి కోసం అనేక కష్టాలు పడుతున్నారు. ఇలా చిన్న వయసులోనే నానా చాకిరి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోంది.

ఆరేళ్లలో 6వేలమందికి పైగా బాలకార్మికుల గుర్తింపు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గడిచిన ఆరేళ్లలో 6,369 మంది బాల కార్మికులను గుర్తించారు. వివిధ ప్రాంతాల్లో వయసుకు మించిన పనులు చేస్తున్న వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బాలల పట్ల వారి భవిష్యత్‌పై నమ్మకాన్ని కలగజేస్తున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 4,798 మంది బాలురు, 1,571 మంది బాలికలను గుర్తించారు. తల్లిదండ్రులు లేని బాలలను ప్రత్యేక పరిస్థితుల్లో 624 మంది బాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంరక్షణ కేంద్రాల్లో ఉంచి వారికి వసతి విద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ప్రధానంగా ఎక్కడంటే...

చిన్నారులు ఎక్కువగా వాణిజ్య వ్యాపార కేంద్రాలు, భవన నిర్మాణ రంగాల్లో ఎక్కువ మందిని గుర్తించారు. ముఖ్యంగా బేకరీలు, బట్టల షాపులు, ఫ్రూట్ షాపులు, మిర్చి బండిలు, టిఫిన్ సెంటర్లు, హోటళ్ల చిరు వ్యాపారాలు చేసే ప్రాంతాల్లో వీరు ఎక్కువగా పని చేస్తున్నట్లు అధికారులు గుర్తిస్తున్నారు. 14 ఏళ్లలోపు పిల్లల్ని పనిలో పెట్టుకుంటే వారిని గుర్తించి బాల కార్మిక చట్టాలు నిబంధనలకు లోబడి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. జూలైలో 9వ విడత ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా కేవలం నిర్మల్ జిల్లాలోనే 56 మంది బాలలకు విముక్తి కలిగించడం గమనార్హం.

స్పెషల్ డ్రైవ్ ల పేరిట ప్రత్యేక తనిఖీలు..

రాష్ట్ర ప్రభుత్వం 2017లో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం కింద ప్రతి ఏటా రెండుసార్లు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ తదితర నూతన జిల్లా కేంద్రాలతో పాటు ప్రధాన పట్టణాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏడాది జనవరి, జూలై మాసాల్లో రెండు నెలల పాటు బాల కార్మికులుగా పనిచేస్తున్న పిల్లలను గుర్తించేందుకు కార్మికశాఖ, శిశు సంక్షేమ శాఖ, పోలీసుశాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బాల కార్మికులను గుర్తించే పనిలో నిమగ్నమవుతున్నారు. ఈ రెండు నెలలకే పరిమితం కాకుండా జిల్లాలోని ప్రత్యేక బృందాలు సైతం ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ బాలలను గుర్తించి వారిని వెట్టిచాకిరి నుంచి విముక్తిని కలిగిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో ప్రత్యేక బృందం పనిచేస్తుంది. ప్రతి బృందంలో ఒక ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లు, స్త్రీ శిశు మహిళా సంక్షేమ శాఖ అధికారి, కార్మిక శాఖ అధికారి, బాలల సంరక్షణ సమితి తదితర ప్రతినిధుల ఏడుగురుతో కూడిన బృందం ఈ తనిఖీలను నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించి వారిని చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలైతే వారిని చేరదీసి ప్రభుత్వం తరఫున సంక్షేమ హాస్టల్లో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.



నిర్మల్ జిల్లాలో మార్కెట్ ప్రాంతంలో తనిఖీలు చేపడుతున్న అధికారులు

యజమానులపై చట్టరీత్యా చర్యలు..



బాల కార్మిక నిషేధ చట్టాల ప్రకారం బాలలను పనిలో పెట్టుకోవడం నేరం. అలా పనిలో పెట్టుకున్న యజమానులపై చట్టరీత్యా శిక్షలు జరిమానాలు ఉంటాయి. గుర్తించిన బాలలను వారి తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. తగిన విచారణ అనంతరం వసతి సౌకర్యాలతో విద్యను అందించే ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎండీ.వాహిద్, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్

రాష్ట్రస్థాయి క్రీడలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ

భైంసా: జావలిన్ డే సందర్భంగా నిర్వహించిన అథ్లెటిక్స్‌లో బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అథ్లెటిక్స్ నిర్వహించారు. ఇందులో అండర్-16, అండర్-18, అండర్-20 బాల, బాలికల విభాగాలలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యలోనే కాకుండా క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చడం హర్షణీయమన్నారు. ఈనెల 7వ తేదీన హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సతీశ్‌కుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు, శ్యాంబాబు, రవికిరణ్, పీఈటీలు రఘువీర్, స్వప్న, వసంత తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతుళ్లు అదృశ్యం

తలమడుగు: తల్లీకూతుర్లు అదృశ్యమైన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నేరడిగొండ గ్రామానికి చెందిన భోగి సునీత, కూతుర్లు నితీశ, నిహారికను తీసుకుని తల్లిగారి గ్రామమైన బరంపూర్‌కు మొహర్రం పండుగకు వచ్చింది. పండుగ ముగిసిన తర్వాత జూలై 30న బరంపూర్ నుంచి అత్తగారింటికి వెళ్తున్నట్లు చెప్పింది. రెండు రోజులు గడిచినా నేరడిగొండకు రాకపోవడంతో భర్త అశోక్ అత్తగారింటికి ఫోన్ చేయగా ఇక్కడ లేదని తెలిపారు. దీంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ కానరాలేదు. చేసేది లేక గురువారం పోలీస్‌స్టేషన్‌లో తల్లి మేకల రాధాబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపింది.

అప్‌గ్రేడైన బోథ్ సీహెచ్‌సీ

- 50 నుంచి వంద పడకల ఏరియా ఆస్పత్రిగా మార్చిన ప్రభుత్వం
- మెరుగుపడనున్న వైద్య సేవలు



ఇటీవల ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన జెడ్పీటీసీ సంధ్యారాణి

బోథ్: బోథ్ సీహెచ్‌సీని 50 నుంచి వంద పడకల ఏరియా ఆస్పత్రిగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు గురువారం జీవో నంబరు 431ను విడుదల చేసింది. గత వారం బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిసి బోథ్ సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని కోరారు. ఈ మేరకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ (ఆరోగ్య శాఖ) ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. గురువారం వంద పడకల ఏరియా ఆస్పత్రిగా మార్చుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆస్పత్రి అప్‌గ్రేడ్‌లో భాగంగా సౌకర్యాల కల్పన కోసం ఫర్నీచర్, పరికరాల కోసం రూ.17కోట్లా 50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు జీవోలో పేర్కొంది. దీంతో ఇక్కడి ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కావడంతో అన్ని రకాల సౌకర్యాలు కలగడంతో పాటు, అందుబాటులో నాణ్యమైన వైద్యం, అన్ని విభాగాల వైద్యులు రానున్నారు. అయితే వంద పడకల ఆస్పత్రిగా మార్చినందుకు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, జెడ్పీటీసీ సంధ్యారాణిలు సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్ రావు, ఇంద్రకరణ్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అందుబాటులోకి అన్ని రకాల సౌకర్యాలు



మంత్రి హరీశ్‌రావును కలిసి విన్నవించగానే వారం రోజుల్లో వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ప్రజలకు అన్ని రకాలు సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. అన్ని విభాగాల వైద్యులు అందుబాటులోకి వస్తారు. వైద్యం కోసం ఆదిలాబాద్, నిర్మల్ వంటి ప్రదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. అడిగిన వెంటనే ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు కృతజ్ఞతలు.

– డాక్టర్ సంధ్యారాణి, జెడ్పీటీసీ, బోథ్

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, నాయకులు

తాంసి/ఆదిలాబాద్: భీంపూర్ మండలంలోని పలు గ్రామాల గుండా అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణానికి రూ.110కోట్ల నిధులు మంజూరు చేయాలని భీంపూర్ మండల బీజేపీ నాయకులు కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. గురువారం ఢిల్లీలో ఎంపీ సోయం బాపూరావు ఆధ్వర్యంలో గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రతో కలిపే అంతర్రాష్ట్ర రహదారుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి నిధులను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి సుంకిడి, తలమడుగు మీదుగా మహారాష్ట్రకు ఆనుకొని ఉన్న సార్థనీ వరకు 60 కిలో మీటర్ల రహదారి అస్తవ్యస్తంగా ఉందని, దాని అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు వివరించారు. భైంసా నుంచి మహారాష్ట్రలోని హిమాయత్ నగర్ వరకూ కుభీర్ మీదుగా దోధర్ణ, చిచోర్డి వరకు 48 కిలోమీటర్ల రోడ్డును మంజూరు చేయాలని కోరారు. నేరడిగొండ మండలం నుంచి మహారాష్ట్రలోని మలక్వాడి వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. నాయకు లు దేవారెడ్డి, రాకేశ్‌యాదవ్, శంకర్, అశో క్, మల్లేశ్, రమేశ్, నారాయణ, గజానన్, చిన్నయ్య, వెంకటేశ్ తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలు | గిరిజనులకు అందేలా చూడాలి



హాజరైన ఆయా శాఖల అధికారులు



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో సంక్షేమ పథకాల అమలు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రజలకు అధికారులు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా వివిధ సమస్యలపై శాఖల వారిగా 3949 అర్జీలు రాగా, ఇప్పటి వరకు 3715 పరిష్కరించడం జరిగిందని, మిగిలిన అర్జీల పరిష్కారానికి అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వందశాతం అమలు చేయాలని సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మారుమూల గిరిజన ప్రాంతాల రోడ్లు, వంతెనలు, కల్వర్టులు దెబ్బతిన్న నేపథ్యంలో వెంటనే మరమ్మతులు చేపట్టి గిరిజన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ యువతకు శిక్షణలు అందించి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి పొందేల చర్యలు చేపట్టాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రాథోడ్ భీంరావు, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి కొమురం బాలు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, జీసీసీ డీఎం రామానందం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, సిర్పూర్-టి ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంత్సరానికి తాత్కాలిక ప్రతిపాదికన ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నాన్ టీచింగ్ సిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ గురువారం తెలిపారు. అకౌంటెంట్, జూనియర్ సెక్రటరీ, సెక్రేటిరియల్ అసిస్టెంట్, ల్యాబ్ అటెండెంట్, ఎలక్ట్రిషియన్, ప్లంబర్, కిచెన్ హెల్పర్ పోస్టుల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకోవడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల4 నుంచి 10వ తేదీ వరకూ ఉట్నూర్ ఐటీడీఏ గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.





మొక్కమొక్కకూ.. పాలిథిన్ కవర్

సిరికొండ: పంటను కాపాడుకోవడం కోసం రైతు కొత్త ఉపాయం ఆలోచించాడు. పత్తి పంటలో కలుపు నివారణ మందుల ద్వారా ఎలాంటి అపాయం రాకూడదని ఇలా ఇంటిల్లిపాది పాలిథిన్ కవర్లను పత్తి మొక్కలకు కప్పుతూ మందులను పిచికారీ చేస్తున్నాడు. దీంతో పంటను తక్కువ ఖర్చుతో కాపాడుకుంటున్నాడు. ఈ దృశ్యం మండలంలోని పొండపూర్ గ్రామ శివారులోని చేనులో కనిపించింది.

చెత్తబుట్టలో పాలు..



సీఎం కేసీఆర్ రైతులకు రుణమాఫీ ప్రకటించడంతో బీఆర్ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం కేసీఆర్, స్థానిక మంత్రి ఐకే రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అయితే వారు తీసుకొచ్చిన పాలను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినియోగించే చెత్త బుట్టలో నింపి వాటితో క్షీరాభిషేకం చేశారు. అమాత్యులపై కనీస గౌరవం లేకుండా పార్టీ నాయకులు ఇలా సంబరాలు జరుపుకోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్